


# దానవుల స్వర్గం

టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి

అక్కడలా ఆ గుడిసె పెద్దెత్తు మంటలో తగలబడి పోతోంటే..... కోనేటి ఒడ్డున.... పై మెట్టు మీద నిలబడ్డ నా కళ్ళ నుండీ రెండు ఆనంద బాష్పాలు అప్రయత్నంగా జారిపోయాయి మొదట. ఆ తదుపరి నా హృదయం ఆనందంతో పరివశించిపోగా.... ఆవెనువెంటనే నా మనసు ఉత్సాహంగా తాండవ నృత్యం చెయ్యడం మొదలు పెట్టింది!!

అలాగని నేను ఏ రాక్షసాంశ సంభూతుడ్నో కాను, వాస్తవానికి నేను చాలా సాత్వికుడ్ని.....

భాగ్య నగరంలో... కొంతమంది సినీ జీవులు ఎంతో ఇష్టంగా నివసించే మధురా నగర్‌లోని ఓ ఆకాశహర్మ్యం లాంటి అపార్టుమెంటులో హాయిగా కాలం గడిపేస్తున్న వాడినయినా నా మనసెప్పుడూ ఈ 'మనసులవారిపల్లె' చుట్టూనే పరిభ్రమిస్తూం టుంది.

నేనిక్కడే పుట్టాను మరి! దాదాపు పదహారు సంవత్సరాలపాటు ఆడుతూ, పాడుతూ పెరిగాను ఇక్కడే! వడ్డాది పాపయ్య శాస్త్రివారి వర్ణ చిత్రంలారటి నాపల్లె నాకెప్పటికీ నిత్య నూతనమే! నేత్రానంద దాయకమే!

చిత్రంగా.... విశాఖలో పుట్టి, రాజధానిలో పెరిగినదయినా.... నన్ను కట్టుకున్నాక సుగాత్రికీ ఈ పల్లెప్రాణ సమానం అయింది క్రమంగా. హైదరాబాదులో పుట్టి అక్కడే పెరుగుతున్న వాళ్ళయినా మా పిల్లలకూ ఈ చిన్న పల్లెటూరంటే ఎంతో యిష్టం. ఇక్కడికి రావడం కొరకే శెలవు కోసం ఎదురు చూస్తుంటారు వాళ్ళు.

రకరకాల పల్లెటూరి వంటకాలను రుచులు, రుచులుగా చేసిపెట్టే అవ్వన్నా, పెరట్లో నులక మంచాల మీద తమను పడుకోబెట్టుకుని ఆకాశంలోని నక్షత్రాలను చూస్తూ ఆసక్తికరమైన కథలు చెప్పే తాతయ్యన్నా ప్రాణం పిల్లలకు. అందువల్లే వ్యయ ప్రయాసలకోర్చి యేడాదికి కనీసం మూడు పర్యాయాలు ఇక్కడికి వచ్చి కొద్ది రోజులైనా గడిపి వెళ్ళగలుగుతున్న అదృష్ట వంతుణ్ణి నేను ప్రస్తుతానికి.

ఇక్కడ వంటా, వార్పూ, పిల్లల సంరక్షణా అమ్మా, పనివాళ్ళూ చూసుకుంటే నాన్నగారూ, సుగాత్రీ నిరవధికంగా వేదాంత చర్చలలో మునిగిపోతారు.

రుచికరమైన అమ్మ చేతి వంటలు కడుపారా తిని అరిగించుకోలేను. ఆసక్తికరమైన వేదాంత చర్చలలోనూ తలదూర్చలేను.... అందుకే:... ఓపికున్నంత వరకూ చిన్ననాటి మిత్రులతో అలా వెళ్ళిపోయి ప్రకృతిని అధ్యయనం చేస్తూ కబుర్లతో గడిపిరావడం.... తతిమ్మా సమయాలలో కాగితాలు కలం అందుకుని సాహితీ సృజన కావించడం నా పని.

ఆ రోజు కూడా గుడి కోనేటి మెట్లమీద నీటికి దగ్గరగా కూర్చుని తెల్ల కాగితాల మీదకు నల్లసిరాతో సాహితీ కుసుమాలను ఏర్చి కూర్చుకుంటూండగా..... మొదట నెమ్మదిగా ఆపై వెంటనే గొడవ · గొడవగా సందడి పెచ్చు మీరిపోతోన్నా కూడా... ఉద్యోగం కోసం నగరానికి నమ్మి వచ్చి మోసపోయి వ్యభిచార గృహంలో చిక్కుకున్న ఓ పేద యువతి దీనగాథను హృద్యమంగా దృశ్యమానం చేసే ప్రయత్నాలలో దీక్షగా లీనమైపోయిన నేను వెంటనే పట్టించుకోలేక పోయాను. గొడవ బాగా పెరిగిపోయాక.... చివరికి.:.. సంగతేమిటో చూద్దామని పైమెట్టు మీదకు వెళ్ళి నిలబడేసరికి కన్పించింది నన్ను కదిలించిన దృశ్యం.

అక్కడ.... అల్లంత దూరంలో.... పద్మసాలె పాపయ్య ఇల్లు అగ్ని కాహుతవుతోంది. గాలి తోడవడంతో మంటలు గొల్ల భీమన్న పశువుల కొట్టం మీదకు ఎగబాకి అవతల గోపురం ఎత్తున్న గడ్డివామి మీదకు విరుచుకుపడే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆవామిగానీ అంటుకుందా.....? ఇహ ఈ గాలికి ఊర్లోని గుడిసెలు, గడ్డివాములూ..... అన్నింటి పనీ అయిపోయినట్లే!

పేదా గొప్పా, చిన్నా పెద్దా, పిల్లా జెల్లా స్త్రీ పురుష భేదం లేకుండా మంటలార్పే కార్యక్రమానికి పరుగులు పెట్టుకుంటూ వస్తున్నారు చేతికి అందిన నీటి బిందెలు, పాత్రలు పట్టుకుని. నేనలా చూస్తూండగానే అందరి పాత్రలలోని నీరూ అయిపోవడంతో వరుసగా అందరూ కోనేటికేసి పరుగులు తీస్తూ రాసాగారు. సరిగ్గా అప్పుడారంభమైన దృశ్యమే నాకంట ఆనంద బాష్పాలు రాల్పించి, నా మనసు, హృదయం..... రెండూ సంతోషంతో పులకించి పోయేలా చేయ గలిగింది.

చిన్నరాముడు, అడవి కట్లము, నెయ్యి, కృష్ణ శాస్త్రి, పేరి శెట్టి నీటిని ముంచి ముంచి అందిస్తూ కోనేట్లో మొల లోతు నీళ్ళలో నిలబడిపోగా..... మెట్ల మీదుగా ఆపై గట్టుపైనా నీటి పాత్రలు చేతులు మార్చుకుంటున్న క్రమం కూడా చిత్రంగానూ, గొప్ప ఆశా జనకంగానూ కన్పించ సాగింది. మస్తాను సాయెబు మొదలుకుని ఏసుపాదం వరకూ ఇతర మతాలకూ, అన్ని కులాలకూ చెందిన అందరి చేతులూ కలసి గొలుసు కట్టుగా కడవలు, బిందెలు, బక్కెట్లు, పాత్రలతో కోనేటి గంగను అగ్ని దేముడి మీదకు చేర్చి ఆయనను చల్లబరిచే కార్యక్రమాన్ని ఓ యజ్ఞకార్యంలా నిర్వర్తిస్తున్నాయి.

నేను ఓ బిందె నీళ్ళయినా ఎవరికి అందివ్వక పోగా ఆదృశ్యాన్ని చూస్తూ గతంలోకి జారి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం మొదలు పెట్టేశాను.....

ఆరో తరగతి చదివే అమూల్యమైన రోజులు.... మనుషుల్ని ప్రేమించే సుగుణం అప్పటికే అలవడుతోంది.

నేనెంతో ఇష్టపడే నా సహపాటి నల్లప్పను ఇంటికి తీసుకువెళ్ళాను ఓ రోజు. వాడు సంశయిస్తున్నా వరండాలోకి తీసుకువెళ్ళాను.... ఇంట్లోకి కూడా తీసుకువెళ్ళే వాడ్నే. ఆలోగా ఇంట్లోంచి పెద్ద పెద్ద అంగలతో వేగంగా వచ్చిన తాతయ్య ఎర్రబడ్డ కళ్ళతో నల్లప్పను గుడ్లురిమి చూడడం, భయపడిపోయిన వాడు ఒక్క గెంతుతో రోడ్లో పడి వెనక్కి తిరిగి చూడకుండా పరుగులంకించుకోవడం జరిగిపోయాయి.

తాతయ్య నన్నయితే ఓ మాటయినా అనకపోయినా ఆ ఘటన చాలాకాలంపాటు వెన్నంటి తరిమింది నా హృదయాన్ని కోస్తూ, మనసును గాయపరుస్తూ.

స్కూల్ ఫైనల్లో ఉండగా వాటర్ ఫాల్సుకు ఎక్స్కర్షన్ వెళ్ళినప్పుడు పెద్ద వెంకటరాముడు తెచ్చుకున్న క్యారియర్ ఇసుకలో పడిపోయినప్పుడు.... నేను తెచ్చుకున్న క్యారియర్ విప్పి ఉన్న ఒకే ఆకులో ఇద్దరం కలసి ఆనందంగా ఆహారం తీసుకున్న వైనం మా ఇంట్లో తెలిశాక పెద్దవాళ్ళు పెట్టిన కేకలు.... ఆ తిట్లకన్నా వెయ్యి రెట్లు బాధ కలిగించిన తరువాతి తంతు..... గంగా జలం కలిపిన నీళ్ళతో స్నానం, నూతన వస్త్రధారణ, దర్భపుల్ల నిప్పుతో నాలుకమీద పడ్డ వాత..... ఇవన్నీ ఏళ్ళ తరబడి నన్ను వెన్నంటి బాధించిన విషయాలు!

ఆ రోజుల్లో ఎన్ని సంఘటనలో..... మచ్చుకి.....

శ్రావణి.... కరణంగారమ్మాయి.... తొలి కాన్పుకు వచ్చినప్పుడు కాన్పు కష్టమై టవున్లోని మిషనాసుపత్రికి తీసుకువెళ్ళక తప్పలేదు.

'మేజర్ సిజేరియన్ చెయ్యాలి.... ఈమె శరీరంలో రక్తం లేదు.... రెండు బాటిల్లు ఓ నెగటివ్ అత్యవసరంగా కావాలి!' అన్నారు ఆస్పత్రివాళ్ళు. ఆ గ్రూపు రక్తం ఆ సమయానికెక్కడా అందుబాటులో లేకపోవడం వల్ల జరూరుగా పల్లె నుండి మనుషులను పిలిపించి రక్త పరీక్షలు చేయించారు.

శుచీ శుభ్రతలతో జీవించే వారెవరిలోనూ ఆ రక్తపు ఛాయలు లేకపోయాయిగానీ తోటి ఎంకిటిగాడిలోనూ, సారా పీపాలాంటి యానాది భీముడిలోనూ అదే రక్తం కన్పించింది. నొప్పీ, నొయ్యా లేకుండా వాళ్ళిద్దరూ రెండు బాటిల్ల రక్తం ఇచ్చేసి నవ్వుకుంటూ, బీడీలు కాల్చుకుంటూ వెళ్ళిపోయాక పండంటి బిడ్డతో గట్టున పడింది శ్రావణి.

తను ప్రాణాపాయంలో ఉన్నప్పుడు తనకెక్కించిన రక్తం ఏ వ్యక్తుల నుండీ తీసుకున్నదీ ఆమెకు తెలిసింది నాలుగు నెలల తరువాత.... తనకు ఆస్పత్రిలో రక్తం ఎక్కించడానికి "రూట్" కోసం నీడిల్ గుచ్చిన ప్రదేశాన్ని కొరివి కట్టెతో కాల్చుకుని పునీతమైపోయింది ఆమె ఆ రోజే!

శూద్రులు సైతం తమ గొప్పదనాన్నీ, పవిత్రతలనూ ఏమాత్రం కోల్పోయేవారు కారిక్కడ.

"ఎర్రోడు" అని పిలువబడే ఎర్రప్ప నాలుగక్షరాలు నేర్చుకున్న నేరానికి బురదమళ్ళలో ఇమడలేక, ఊరి వెలుపల విడిగా బ్రతక లేక మిలటరీలో సిపాయిగా చేరిపోయి నెమ్మదిగా పైకెదిగాడు. కాశ్మీర్ యుద్ధంలో లాన్స్నాయక్గా విశేష ప్రతిభ కనబరచి యుద్ధం తదుపరి ప్రమోషనూ, రిపబ్లిక్డే ఉత్సవాలలో రాష్ట్రపతి వద్ద పతకాలూ పొంది శెలవుపై ఇక్కడికి వచ్చినప్పుడు వాడిని భోజనానికి పిలిచిన నా మిత్రుడు శివప్ప వాడికి వరండా గదిలోనే భోజనం పెట్టించడాన్ని చూశాను నేను. వాడు వెళ్ళిపోయాక పాత్రలను నిప్పుతో కాల్పించి శుద్ధి చేయించమని శివప్ప తన భార్యను పురమాయించడాన్ని కూడా వినగలిగాను.

స్వర్గంలాంటి నా ఊర్లోని మనుషులలో మాత్రం మార్పు వచ్చే అవకాశమే లేదని నిర్ణయించుకునేశాను ఎప్పుడో.

కానీ నేటి ఈ సంఘటన....? నిజానికి ఈ ఘటన ద్వారా ఊర్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టబడే అవకాశం ఉంది..... ఎందుకంటే.... మనసులవారి పల్లెలోని అగ్ర వర్ణాల వారందరికీ ఈ కోనేటి నీరే అనాదిగా ఆధారం. తతిమ్మా వారు అరమైలు దూరంలోని దెయ్యాల బావి నుండీ నీటిని తోడి తెచ్చుకుంటారు. ప్రభుత్వం వారు వేయించిన బోరింగులు ఊర్లో మూడున్నాయి కానీ మూడింటిలోనూ ఉప్పునీరే.

ఈ అగ్ని ప్రమాదం పుణ్యమా అని మా ఊరి చరిత్రలోనే ఓం ప్రథమంగా కోనేటి నీటిలోనికి అన్యులు ప్రవేశించడం జరిగిపోయింది. కాబట్టి ఇహపై వారి ఆడవాళ్ళు, నీళ్ళ కోసం అంత దూరం వెళ్ళాల్సిన పనిలేకుండా ఇక్కడే ముంచుకు వెళ్ళవచ్చు. ఇది చాల చిన్న మార్పు కావచ్చు.... కానీ అనేక మార్పులకు అవకాశం కలిగించగలదు.

నా ఆలోచనలలో నేనుండగానే మంటలు పూర్తిగా ఆరిపోయాయి. ఆప్రదేశం నుండీ అదో రకమైన బూడిద మట్టి వాసన వస్తోంది. అందరి శరీరాలూ, దుస్తులూ మట్టి, మసి బూడిద కొట్టుకుని వున్నాయి.

అగ్రజులందరూ మొదట కోనేట్లో దిగి తమ శరీరాలను, దుస్తులనూ పరిశుభ్రపరచుకున్నారు.

ఇక తతిమ్మా వాళ్ళు కోనేట్లోకి దిగుతారని ఎదురుచూస్తున్నాను నేను.... కానీ ఒక్కరైనా కదలరే?

నా గాలి మేడలను బ్రద్దలు కొడ్తూ అన్నాడు రామప్ప పేరి శాస్త్రితో....

"బాబయ్యా! నాలుగు బిందెలు నీళ్ళు పోయించండి.... కాళ్ళు చేతులు కడుక్కుని పోతాం!"

"మేమందరం కడుక్కునేశాం కదరా?.... వెళ్ళి..... ఊరి బయట చెరువులో కడుక్కోండి..... పోండి!"

"సరే బాబయ్యా!" అంటూ అటు తిరిగి అడుగు లెయ్యడం మొదలు పెట్టాడు రామప్ప.... అతని వెనుకగా ఒక్కొక్కరే..... బలిపశువులు!..... ఎన్ని చట్టాలు వచ్చినా, సమాజం ఎంత ముందుకు పోయినా వీళ్ళ పద్ధతులలో, అలవాట్లలో మాత్రం మార్పులుండవు.... అంతే!

"ఒరేయ్ సుబ్రమణ్యం! నీవు వెళ్ళి గుడి పూజారిని చావడి వద్దకు తీసుకురారా! కోనేటికి రేపే సంప్రోక్షణ చేయించాలి..... అంతదాకా మనందరికీ బోరింగుల ఉప్పునీరే గతి!" అంటూ రెడ్డి వెళ్ళిపోతున్నాడు.

"భగవంతుడా! స్వర్గం లాంటి నా ఈ ఊర్లో ఉన్నది దేవతలా? మనుషులా? లేక...?" అనుకున్నాను నిరాశగా..... దిగులుగా తమ తమ నష్టాలను చూసుకుంటున్న పాపన్న కుటుంబీకులనూ, భీమన్న బంధువులనూ చూస్తూ.... ❋

**- టి.ఎస్.ఏ. కృష్ణమూర్తి**

## టెన్షన్

అమీషా మంచి నటి. ఒక విధంగా చెప్పాలంటే అదృష్టవంతురాలు కూడా అయితే... ఒకే సినిమాలో నటించి అఖండమైన పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న తర్వాత మళ్ళీ హృతిక్తో మరో పిక్చర్కి ఆఫర్ రాలేదు ఎందుకనో.... తెలుగులోనూ అంతే... 'బద్రి'లో పవన్తో నటించిన తరవాత... వీళ్ళిద్దరూ తెలుగు ఫీల్డుని ఏలేస్తారు. చక్రం తిప్పుతారు అనుకుంటుండగా, రెండో పిక్చర్కే డిపాజిట్లు లేకుండా పోయాయి. పవన్ నుండి పిలుపు, ఇటు హృతిక్ నుండి పిలుపు లేదు. అందుకే అమీషా టెన్షను పడుతోంది.

